క్లుప్తంగా

అన్నార్తుల ఆకలి తీర్చడం అభినందనీయం



నిరుపేదలకు అన్నదానం చేస్తున్న ఎంపీపీ వెంకటేశ్వరరావు, యోగా శ్రీనివాస్

అంబాజీపేట: ఆకలితో అలమటిస్తున్న నిరుపేద అన్నార్తులకు పట్టెడు భోజనం పెట్టడం ఎంతో అభినందనీయమని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. అంబాజీపేట స్వామి వివేకానంద యోగా ఆశ్రమం, ఆయుర్వేదం, ఫిజియోథెరపి హాస్పిటల్ ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ పేరున అన్నదాన శిబిరాన్ని ప్రారంభించి ఏడాది పూర్తయిన సందర్భంగా యోగా శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిరుపేదలకు భోజన ప్యాకెట్లను ఆదివారం పంపిణీ చేశారు. సుమారు 350 మంది నిరుపేదలకు, దివ్యాంగులకు మండల పరిషత్ కార్యాలయం, యోగా ఆశ్రమం వద్ద పంపిణీ చేశారు. కార్యక్రమంలో పితాని వీరాస్వామి, కుడుపూడి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అంతర్వేది యాత్రికులకు ప్రసాద వితరణ



తాటిపాక సెంటర్‌లో ప్రసాద వితరణ చేస్తున్న అగ్నికుల క్షత్రియ నాయకులు

రాజోలు: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి పౌర్ణమి స్నానాలకు వెళ్లే భక్తులకు ఆదివారం తాటిపాక సెంటర్, అంతర్వేది విగ్రహాల వద్ద యాత్రికులకు ప్రసాద వితరణ చేశారు. మహా గజమాల యాత్ర వ్యవస్థాపకుడు చింతా మహా నాగరాజు ఆధ్వర్యంలో ప్రసాదం ప్యాకెట్లను పంపిణీ చేశారు. యిల్లింగి వెంకటరమణ, తిరుమాని ఆచార్య, కాటాడి ఉమా మహేశ్వరరావు, మల్లాడి శ్రీనివాసరావు, పొన్నమండ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆనందోత్సాహాలతో హజరత్ అలీ జయంతి



కవి సమ్మేళనంలో పాల్గొన్న ముస్లింలు

మామిడికుదురు: ముస్లింల ఆరాధ్య దైవం హజరత్ ఇమామ్ అలీ జయంతిని ఆదివారం ఆనందోత్సాహాలతో నిర్వహించారు. దీనిలో భాగంగా స్థానిక భార్గాహే ఖమరే బన్నీ హాసిం పంజాలో మిలాద్ జరిగింది. మత ప్రబోధకుడు మీర్ అబ్బాస్ అలీ మిలాద్ ఆలపించారు. ముత్తకి స్వగృహంలో మిలాద్ జరిగింది. మత ప్రబోధకుడు షబ్బర్ అలీ జైదీ మిలాద్ ఆలపించారు. నగరంలోని పెద పంజీషాలో ఇమామ్ అలీ జయంతిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు ఉర్దూ కవులు తమ కవిత్వాల ద్వారా హజరత్ అలీ జీవిత చరిత్రను భక్తులకు వివరించారు.

గోదావరి మాతకు పున్నమి హారతి



జొన్నాడ పుష్కరఘాట్ వద్ద గోదావరి మాతకు పూజలు నిర్వహిస్తున్న మహిళలు

ఆలమూరు: మండలంలోని జొన్నాడలో అఖండ గౌతమీ గోదావరి తీరంలో ఆదివారం సాయంకాలం గోదావరి మాతకు అఖండ పున్నమి హారతి జరిగింది. శుభకృత్ నామ సంవత్సర మాఘ శుద్ధ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రముఖ వేద పండితుడు ద్విభాష్యం రవికృష్ణ శర్మ పర్యవేక్షణలో గ్రామానికి సత్తి రామకృష్ణారెడ్డి, నాగమణి దంపతుల ఆధ్వర్యంలో మహిళా భక్తులు శాస్త్రోక్తంగా ఈ పున్నమి హారతిని చేపట్టారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య మహిళలు స్థానిక శ్రీ, భూ సమేత జనార్దనస్వామి ఆలయం నుంచి ఊరేగింపుగా బయలుదేరి గౌతమీ తీరానికి చేరుకుని గోదావరి మాతకు అఖండ పున్నమి హారతిని ఇచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని వివిధ ఆలయాల్లో విష్ణు, లలిత సహస్రనామాలు, కనకధార, అష్టోత్తర, వేద పారాయణ పఠించారు.

వైద్యానికి రూ.10 వేల సాయం

రావులపాలెం: ఆలమూరు గ్రామానికి చెందిన మట్టా వీరభద్రరావు పక్షవాతంలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. పేదరికంలో ఉన్న వారి పరిస్థితి తెలుసుకున్న రావులపాలెం కాశీ అన్నపూర్ణాదేవి సేవా సమితి సభ్యులు సమకూర్చిన రూ.10 వేల నగదును సాయంగా బాధిత కుటుంబానికి అందజేయాలని వారి బంధువులకు ఆదివారం స్థానిక సేవాసమితి కార్యాలయం వద్ద అందజేసినట్టు సేవా సమితి సభ్యులు తెలిపారు.

సంక్షేమ పాలన జగనన్నకే సాధ్యం

- ఎమ్మెల్యే చిట్టిబాబు
- మాచవరంలో గడప గడపకూ..



అంబాజీపేటలో మహిళకు పథకాల లబ్ధి వివరిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

అంబాజీపేట: సంక్షేమ పాలన సీఎం జగన్‌మోహన్ రెడ్డికే సాధ్యమని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. మాచవరం సచివాలయం–1లో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఎమ్మెల్యే చిట్టిబాబు ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును ప్రజల్ని అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దారిద్ర్యరేఖకు ఎగువనున్న వారికి సైతం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. రైతాంగాన్ని ఆదుకునేందుకు ఆర్బీకే వ్యవస్థ తీసుకొచ్చారన్నారు. విద్యార్థుల ఉన్నత భవిష్యత్ కోసం నాడు–నేడు ద్వారా పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నారన్నారు. మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యమైన ఆహారాన్ని అందిస్తున్నారన్నారు. తాజాగా విద్యార్థులకు అల్పాహారంగా రాగి మాల్ట్ అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు.

జగనన్న పాలనలో ప్రతి పేదోడికి సంపూర్ణ న్యాయం జరుగుతుందని, ఈ పాలనను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అనంతరం సంక్షేమ పథకాల బ్రోచర్లను లబ్ధిదారులకు అందజేశారు. వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యదర్శి నాగవరపు నాగరాజు, కొర్లపాటి కోటబాబు, ఉందుర్తి నాగబాబు, అప్పన శ్రీను, కుసుమ శ్రీను, సూదాబత్తుల రాముల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పేరి శ్రీనివాస్, మైలా ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

వైనతేయలో భక్తుల పుణ్యస్నానాలు

పి.గన్నవరం: మాఘ పౌర్ణమి సందర్భంగా పి.గన్నవరంలోని పవిత్ర వైనతేయ నదీపాయలో ఆదివారం భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. దీంతో స్నాన ఘట్టం భక్తులతో కిటకిటలాడింది. అనంతరం భక్తులు ఆలయాలకు వెళ్లి పూజలు చేశారు.

ఆక్వా రైతుల సమావేశం

అమలాపురం రూరల్: అమలాపురం క్షత్రియ కల్యాణ మండపంలో ఆక్వా రైతుల సమస్యలపై చర్చించేందుకు ఆదివారం కోనసీమ ఆక్వా రైతులు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కోనసీమ ఆక్వా రైతుల సంఘం అధ్యక్షుడు రుద్రరాజు నానిరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రైతు నాయకులు చవటపల్లి నాగభూషణం, నానిరాజులు మాట్లాడుతూ సోమవారం స్పందనలో జిల్లా కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహించి కలెక్టర్‌కు తమ సమస్యలపై ఫిర్యాదు చేస్తామని చెప్పారు. జిల్లావ్యాప్తంగా ఉన్న ఆక్వా రైతులు తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రైతు నాయకులు రమేష్ రాజు, సూరిబాబు రాజు, సత్తిబాబు రాజు, కాశీ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహాల పునః ప్రతిష్ఠ

మామిడికుదురు: మగటపల్లిలో పునర్నిర్మించిన గ్రామ దేవతలు ధనమ్మ, వనువులమ్మ వార్ల ఆలయంలో ఆదివారం విగ్రహాల పునః ప్రతిష్ఠ ఆదివారం ఘనంగా జరిగింది. శ్రీశుభకృత్ నామ సంవత్సరం మాఘశుద్ధ పౌర్ణమి శుభ ముహూర్తాన ఉదయం 9.05 గంటలకు వేద మంత్రాలు, భక్తుల కోలాహలం, బాణసంచా కాల్పుల నడుమ విగ్రహాల పునః ప్రతిష్ఠ మహోత్సవాన్ని ఆద్యంతం ఘనంగా నిర్వహించారు. గణపతి పూజ, పుణ్యాహ వాచనం, నూతన విగ్రహాలకు మహాస్నపనం, గర్తన్యాసం, సుముహూర్త విగ్రహ, శిఖర ప్రతిష్ఠ, గోదృష్టి, కళాన్యాసం, మహా పూర్ణాహుతి, మహా కుంభాభిషేకం తదితర కార్యక్రమాలను అంగరంగ వైభవంగా జరిపించారు. దీనిలో భాగంగా భక్తులకు భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. అనంతరం గరగ నృత్యాలు, బాణసంచా కాల్పులు, చిత్ర, విచిత్ర వేషధారణలతో అమ్మవార్ల జాతర మహోత్సవాన్ని కనులపండువలా జరిపించారు.

ఆలమూరులో...

ఆలమూరు: స్థానిక యానాదుల పేటలో ఆదివారం శ్రీసత్తెమ్మ తల్లి, పోతురాజు, వినాయకుని విగ్రహాల ఆవిష్కరణ జరిగింది. యానాదుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈకార్యక్రమానికి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బండారు సత్యానందరావు విచ్చేసి పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

అయినవిల్లి: మండలంలోని వెలువలపల్లిలో అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ ఆదివారం ఘనంగా జరిగింది. వేదపండితులు ఆధ్వర్యంలో స్వామికి విశేష పూజలు నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యాళ్ల దొరబాబు, టీడీపీ నాయకులు మెట్ల రమణబాబు, గంటి హరీష్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ప్రశాంతంగా ఎన్ఎంఎంఎస్ పరీక్షలు



కొత్తపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల సెంటర్ తనిఖీ చేస్తున్న డీఈఓ రవిసాగర్

కొత్తపేట: ప్రతిభా విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వ నేషనల్ మీన్స్ అండ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) ద్వారా ఆర్థిక ప్రోత్సాహం కల్పించే ప్రతిభా పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఈ పరీక్ష నిర్వహించి ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం వరకూ 4 ఏళ్ల పాటు ఏడాదికి రూ.12 వేలు చొప్పున రూ.46 వేల ప్రోత్సాహం అందజేస్తున్న విషయం తెలిసిందే. ఈ పరీక్షను డివిజన్ కేంద్రాల్లో నిర్వహిస్తారు. ఆ విధంగా డాక్టర్ బీఆర్ కోనసీమ జిల్లా పరిధిలో డివిజన్ కేంద్రాలు అమలాపురం, రామచంద్రపురంలో నిర్వహించేవారు. అయితే కొత్తగా కొత్తపేట రెవెన్యూ డివిజన్ ఏర్పడటంతో ఈసారి కొత్తపేటలో పరీక్షలు నిర్వహించారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎస్‌వీ రవిసాగర్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ బి.రమణశ్రీ పర్యవేక్షణలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ పరీక్ష నిర్వహించారు. జిల్లాలో మొత్తం 3,159 మంది విద్యార్థులకు 3,018 మంది హాజరయ్యారు. 141 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. కొత్తపేట డివిజన్ కేంద్రం కొత్తపేటలో కొత్తగా 4 సెంటర్లు ఏర్పాటు చేయగా 960 మందికి 934 మంది హాజరయ్యారు. అమలాపురం, రామచంద్రపురం డివిజన్లలోని 2,199 మందికి, 11 సెంటర్లలో 2,084 మంది హాజరయ్యారు.

అధికారుల తనిఖీలు

ఎన్ఎంఎంఎస్ పరీక్షలలను పకడ్బందీగా నిర్వహించారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎస్‌వీ రవిసాగర్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ బి.రమణశ్రీ నేతృత్వంలో 2 ఫ్లయింగ్ స్క్వాడ్స్ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశాయి. ఎక్కడా ఎటువంటి మాల్ ప్రాక్టీస్ జరగకుండా ప్రశాంతంగా జరిగాయని డీఈఓ రవిసాగర్ తెలిపారు.

ప్రజలకు తోడుగా గృహసారథులు



అయినవిల్లిలో గృహ సారథులకు కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

అయినవిల్లి: సీఎం జగన్ ప్రతి ఒక్కరి వద్దకు రావడం కష్టం కాబట్టి ప్రజలకు నిత్యం తోడుగా ఉండేలా గ్రామాల్లో గృహ సారథులను నియమించారని, వీరి ద్వారానే ప్రజలకు సంక్షేమ పథకాలు నేరుగా అందుతున్నాయా? లేదా? అని తెలుసుకోవడం సాధ్యపడుతుందని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. ఆదివారం ముక్తేశ్వరం వైవీఎస్ అండ్ బీఆర్ఎం కళాశాల ఆవరణలో సచివాలయ మండల కన్వీనర్, గృహసారథుల మండల కన్వీనర్ పులిదిండి ప్రభాకరరావు అధ్యక్షతన గ్రామ వలంటీర్లు, గృహసారథుల శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు మాట్లాడుతూ ప్రజలకు తోడుగా గృహసారథులను నియమించామన్నారు. ప్రజలకు ఇచ్చిన ఎన్నికల హామీలను 100 శాతం అమలు చేసేందుకు రాబోయే రోజుల్లో వీరి పాత్ర క్రియాశీలకమన్నారు. ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యాదీవెన మొదలైన పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపాయన్నారు. అనంతరం ఎమ్మెల్యే చిట్టిబాబు గృహ సారథులకు కిట్లను పంపిణీ చేశారు. నియోజకవర్గ అబ్జర్వర్ సీతారామాంజనేయులు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో సీఎంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే ప్రజలు ఓటు వేసి గెలిపిస్తారన్నారు. ప్రజలకు గృహసారథులు అండగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు, అంబాజీపేట మార్కెట్ కమిటీ చైర్మన్ వేటుకూరి వెంకట్రాజు, వైస్ ఎంపీపీ బయ్యా చిన బాబు, మట్టపర్తి శ్రీనివాస్, కుడుపూడి విద్యాసాగర్, కుసుమ లిల్లీమంగేష్కర్, వారా జయసావిత్రి, గుమ్మడి ప్రసాద్, గుత్తుల నాగబాబు, యడ్ల కిరణ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వీరభద్రుని విగ్రహ ప్రతిష్ఠ



జి.అగ్రహారం అరిగెలవారిపాలెంలో వీరభద్రునికి పూజలు చేస్తున్న భక్తులు

అంబాజీపేట: గంగలకుర్రు అగ్రహారం శివారు అరిగెల వారిపాలెంలో శ్రీశ్రీశ్రీ వీరభద్రస్వామి వారి ఆలయ విగ్రహ శిఖర ప్రతిష్ఠలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. తొలుత స్వామికి గర్తంన్యాసం, రత్నం న్యాసం, పంచావీర్యం, పంచలోహ నిక్షేపణం, యంత్ర శిఖర ప్రతిష్ఠలు, పూర్ణాహుతి, దీక్షా విమోచకం, గోదృష్టి, కుష్మాండచ్ఛేన, దివ్య దర్శనంలను ఘనంగా జరిపారు. ఆలయ ప్రాంగణంలో సోమవారం స్వామి వారి భారీ అన్న సమారాధన చేపట్టి రాత్రి సంబరం చేయనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మాచవరంలో వేంచేసియున్న పార్వతీ రాజేశ్వరస్వామి, కందుల మల్లేశ్వరస్వామి, సుబ్రహ్మణేశ్వర స్వామి వార్ల ముఖ ద్వారం నిర్మాణానికి ఆదివారం భూమి పూజ చేశారు. ఈ ముఖ ద్వారాన్ని అప్పన వెంకట్రాజు కుటుంబ సభ్యులు నిర్మిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు తెలిపారు. తొలుత స్వామి వార్లకు ప్రత్యేక పూజలు చేశారు.

ఘనంగా వీరభద్రుల సంబరం



అప్పనపల్లిలో వీరభద్రుణ్ణి ఊరేగిస్తున్న భక్తులు



పి.గన్నవరంలో బాల వీరభద్రస్వామిని ఊరేగిస్తున్న భక్తులు

మామిడికుదురు: అప్పనపల్లిలో కొలువుదీరిన సాయి వీరభద్రస్వామి ఆలయం వద్ద ఆదివారం వీరభద్ర స్వామి సంబరం ఘనంగా జరిగింది. తులా గోపాలకృష్ణ ఆధ్వర్యంలో గనిశెట్టి ఈశ్వరరావు–పుష్పావతి దంపతులు ఈ పూజని నిర్వహించారు. దీనిలో భాగంగా ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం ఊరేగింపుగా వైనతేయ గోదావరి నదికి వెళ్లారు. అనంతరం ఆలయం వద్ద శూలాల పూజతో పాటు జమ్మిచెట్టు వద్ద ప్రత్యేక పూజలు జరిపారు. స్వామిని పలువురు దర్శించుకున్నారు.

పి.గన్నవరంలో..

పి.గన్నవరం: స్థానిక గొల్లల వీధిలో గుండుబోగుల సూర్యనారాయణ–వెంకటలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో బాల వీరభద్రస్వామి సంబరం ఆదివారం వైభవంగా జరిగింది. బాల వీరభద్రస్వామిని బ్యాండు మేళాలతో బాణసంచా కాలుస్తూ పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం గరుడేశ్వర స్వామి వారి ఆలయంలో పూజలు చేశారు. సూర్యనారాయణ నివాసంలో వెలసిన వీరభద్రస్వామి గద్దెలో భక్తులు పూజలు చేశారు. సూర్యనారాయణ ఆధ్వర్యంలో భక్తులకు పెద్ద ఎత్తున అన్నసమారాధన నిర్వహించారు. స్థానిక నాయకులు, భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

జనసేనకు బై.. వైఎస్సార్ సీపీకి జై..



పార్టీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

రావులపాలెం: మండలంలోని ఈతకోట గ్రామానికి చెందిన పలువురు ఆదివారం జనసేన పార్టీ వీడి ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుల ఆధ్వర్యంలో కరాటి గణపతి, సజ్జా సాయిరామ్, గండ్రోతు వాసు, తోట దుర్గారావు, ఏపుగంటి గణపతి, ఏపుగంటి వెంకటేష్, మూర్తి, జనిపిరెడ్డి అశోక్, మణికంత, శ్రీఘా కొల్లపు శ్రీ హరి, రాచకొండ వాసు, తోట ధనరాజు, తొండూరి అమ్మన్న, దంగేటి బాబీ, కుంపట్ల మణి తదితరులు గోపాలపురం ఎమ్మెల్యే స్వగృహం వద్ద జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీలో చేశారు. వీరికి ఎమ్మెల్యే జగ్గిరెడ్డి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు.

ఘనంగా ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠ



కేశవదాసుపాలెంలో పెద్దింట్లమ్మ ఆలయంలో నిర్వహించిన ధ్వజస్తంభ ప్రతిష్ఠ

సఖినేటిపల్లి: మండలంలోని కేశవదాసుపాలెం శివారు మెండుపాలెంలో ఆదివారం పెద్దింట్లమ్మ అమ్మవారి ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠ, ఆలయ శిఖర ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. గత రెండు రోజులుగా ప్రతిష్ఠలకు సంబంధించి విశేష పూజలను నిర్వహించారు. ప్రతిష్ఠలు పురస్కరించుకుని మహాపూర్ణాహుతి నిర్వహించారు. అంతకు ముందు ధ్వజస్తంభానికి, శిఖరాలకు విశేష పూజలు చేశారు. అఖండ అన్న సమారాధన నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యాన, మెండు శ్రీను, కొప్పినీడి చంటిబాబు, కుంపట్ల శ్రీనివాస్, మెండు రామమూర్తి, కొత్తపల్లి సాయి బాబు, పి.రాజేష్ పాల్గొన్నారు. అలాగే మోరిలో విఘ్నేశ్వరుని నూతన ఆలయానికి ఆదివారం పేరాబత్తుల దొరబాబు దంపతులు శంకుస్థాపన చేశారు. ఆలయ పూజారి వాడపల్లి శ్రీనివాసాచార్యులు వేదమంత్రాలతో ఈ పూజ నిర్వహించారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పంట కాలువలను అభివృద్ధి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న స్వచ్ఛభారత్ సెల్ రాష్ట్ర కన్వీనర్ సత్యానందం

మామిడికుదురు: తుప్పలు, డొంకలతో పంట కాలువలు పూడుకుపోయి సాగునీటి సరఫరాకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోందని దీనిపై సంబంధిత అధికారులు తక్షణం స్పందించి చర్యలు తీసుకోవాలని బీజేపీ స్వచ్ఛభారత్ సెల్ రాష్ట్ర కన్వీనర్ పాలూరి సత్యానందం డిమాండ్ చేశారు. అప్పనపల్లిలో పార్టీ రాష్ట్ర కిసాన్‌మోర్చా కార్యవర్గ సభ్యుడు కంకిపాటి సుబ్బారావు ఇంటి వద్ద ఆదివారం జరిగిన పార్టీ సమావేశానికి బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు మెండా ఆదినారాయణ అధ్యక్షత వహించారు. స్వచ్ఛభారత్ సెల్ కన్వీనర్ సత్యానందం మాట్లాడుతూ వరిచేలకు నీటి ఎద్దడి ఏర్పడడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. పంట కాలువల్లోకి డ్రైనేజీ తూరలు ఏర్పాటు చేయడం వల్ల పంట కాలువలు డ్రైన్లను తలపిస్తున్నాయన్నారు. దీనిపై సంబంధిత అధికారులు తక్షణం స్పందించాలన్నారు. కరోనాతో మృతి చెందిన వారికి రూ.50 వేలు పరిహారం వెంటనే విడుదల చేయాలని, కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న సెంట్రల్ ఫండ్ నిధులతో బి.దొడ్డవరం–పెదపట్నం లంక రహదారిని ఆధునీకరించాలని కోరుతూ సమావేశంలో తీర్మానించారు. సమావేశంలో పార్టీ నేతలు వేగి వెంకటేశ్వరరావు, పసుపులేటి మహలక్ష్మీరావు, పాలూరి సత్తిబాబు, కటికిరెడ్డి తమ్మయ్య నాయుడు, కటికిరెడ్డి గంగాధరం, పెద్దిరెడ్డి శ్రీనివాస్, నుదురుమాటి ఆదిత్య, పెదసింగు త్రిమూర్తులు పాల్గొన్నారు.

క్యూలైన్ ఎంట్రన్స్‌లో టికెట్ కౌంటర్లతో అవస్థలు



పశ్చిమ రాజగోపురం ముఖద్వారం వద్ద గుమిగూడిన భక్తులు

సఖినేటిపల్లి: అంతర్వేదిలో మాఘ పౌర్ణమి పురస్కరించుకుని ఆదివారం లక్ష్మీనృసింహుని దర్శనార్థం తరలి వచ్చిన భక్తులు ఆలయం వద్ద క్యూలైన్లకు ఎంట్రన్స్‌లోనే టికెట్ కౌంటర్లు ఏర్పాటు చేయడం వల్ల పిల్లాపాపలతో అవస్థలు పడ్డారు. ఆలయం వెలుపల వరుసగా మూడులైన్లు ఒకదాని పక్కన ఒకటి ఏర్పాటు చేశారు. ఇందులో తూర్పువైపు లైను ఫ్రీ దర్శనం లైను, పడమర వైపు రూ.100 టికెట్టు దర్శనం లైను, మధ్యలో వీఐపీల దర్శనం లైను ఏర్పాటు చేశారు. అయితే ఈ మూడింటికి సెంటర్‌గా లైన్లు ఎంట్రన్స్‌కు చేరి రెండు రూ.100 టికెట్లు అమ్మే కౌంటర్లు ఏర్పాటు, పక్కనే రథం షెడ్డు ఉండడం వల్ల భక్తులకు వెళ్లే సరైన మార్గం లేక తీవ్రమైన తొక్కిసలాట చోటుచేసుకుంది. గతంలో టికెట్ కౌంటర్లు ఆలయం లోపల వేర్వేరు చోట్ల క్యూల వద్ద ఉండేవని, బయటపెట్టిన విధానంలో మూడు క్యూలకు సమీపాన అధికారులు టికెట్ కౌంటర్లు పెట్టడం వల్ల, పైగా పక్కనే రథం షెడ్డు ఉండడం వల్ల భక్తులకు టికెట్ కొనుగోళ్లకు, క్యూలో వెళ్లడానికి రద్దీ పెరిగి, అసౌకర్యంగా మారిందని స్థానికులు తెలిపారు.

కళాకారుల ప్రతిభ అద్వితీయం



ముక్కామలలో కళాకారులను సత్కరిస్తున్న దృశ్యం

అంబాజీపేట: గత నెల ఢిల్లీలో జరిగిన రిపబ్లిక్ డే సందర్భంగా ఏపీ నుంచి ప్రదర్శించిన కోనసీమ ప్రభల శకటం ప్రదర్శనలో పాల్గొన్న కళాకారుల ప్రతిభ ఎంతో అద్వితీయమని సమాచార శాఖ జాయింట్ డైరెక్టర్ పి.కిరణ్‌కుమార్ అన్నారు. ముక్కామల పంచాయతీ వద్ద బండారు మల్లి అధ్యక్షతన ఢిల్లీ పరేడ్‌లో పాల్గొన్న పసుపులేటి నాగబాబు బృంద కళాకారులకు ఆదివారం సన్మానం నిర్వహించారు. జేడీ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ జగ్గన్నతోటలో సంక్రాంతి కనుమ రోజున జరిగే ఏకాదశ రుద్రుల ప్రభల నమూనాతో తయారు చేసి ప్రదర్శించడం ఎంతో అద్భుత ఘట్టమన్నారు. ఏకాదశ రుద్రప్రభల థీమ్, గరగ నృత్యాలు, సన్నాయి మేళం దేశంలోని ప్రజలంతా వీక్షించారన్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి పాల్గొన్న శకటానికి ప్రాతినిథ్యం వహించడం ఉమ్మడి జిల్లాల నుంచి తరలివెళ్లిన 30 మంది కళాకారుల ప్రదర్శన చేయడం అభినందనీయమన్నారు. జేడీతో పాటు శకటాన్ని అద్భుతంగా తీర్చిదిద్దిన మధులను నాగబాబు, కుమార్‌ల బృందం, స్థానిక గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి వి.తాతాజీ, దువ్వూరి బాలకృష్ణమూర్తి, దేవరపల్లి చినబాలయోగి తదితరులు పాల్గొన్నారు.

నదిలో మునిగిన బాలుడిని రక్షించిన భక్తులు

పి.గన్నవరం: స్థానిక వైనతేయ నదీపాయలో ఆదివారం ఉదయం స్నానం చేస్తూ ప్రమాదవశాత్తూ నీట మునిగిన పదేళ్ల బాలుడిని భక్తులు రక్షించారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మాఘ పౌర్ణమి సందర్భంగా వైనతేయ నదీపాయలో పుణ్య స్నానాలు ఆచరించేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. ఈ క్రమంలో అంబాజీపేట మండలం గంగలకుర్రుకు చెందిన ఓ మహిళ తన కుమారుడు, కుమార్తెతో కలసి వైనతేయలో స్నానానికి దిగారు. అయితే బాలుడు నదిలో ముందుకు వెళ్లి నీటిలో మునిగిపోతుండడంతో అతడి తల్లి, సోదరి కేకలు వేశారు. దీంతో స్థానిక భక్తుడు ఒకరు ఆ బాలుడిని రక్షించారు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

నేడు వలంటీర్లు, గృహ సారథులతో సమావేశం

పి.గన్నవరం: మండలంలోని వలంటీర్లు, గృహసారథులతో సోమవారం పి.గన్నవరంలో సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు తెలిపారు. ప్రభుత్వాస్పత్రి రోడ్డులో మండల పార్టీ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు కార్యాలయం వద్ద ఉదయం 9 గంటలకు సమావేశం ప్రారంభం అవుతుంది. వలంటీర్లకు, గృహసారథులకు శిక్షణ తరగతులు జరుగుతాయని చిట్టిబాబు తెలిపారు. కార్యక్రమానికి మండలంలోని వలంటీర్లు, గృహసారథులు, నాయకులు హాజరు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

మృతుడి ఆచూకీ లభ్యం

మలికిపురం: స్థానిక గుడిమెళ్ళంక వంతెన వద్ద పంటకాలువలో శనివారం లభ్యమైన గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం మలికిపురం గ్రామానికి చెందిన పెసింగి సత్యనారాయణ(66)గా గుర్తించినట్లు ఎస్సై హరికోటి శాస్త్రి ఆదివారం తెలిపారు. ఇంటి నుంచి బయటకు వెళ్లిన సత్యనారాయణ రాకపోవడంతో బంధువుల ఇంటి వద్ద వెతికిన అనంతరం శనివారం లభ్యమైన మృతదేహాన్ని బంధువులు గుర్తించినట్లు ఎస్సై హరికోటిశాస్త్రి తెలిపారు.

రాంబాబుకు సత్కారం

ఆలమూరు: గుమ్మిలేరు గ్రామ ఉత్తమ సర్పంచ్ అవార్డు గ్రహీత గుణ్ణం రాంబాబుకు ఆదివారం ఘన సత్కారం జరిగింది. స్థానిక శ్రీసీతారామ కల్యాణ మంటపంలో గ్రామస్తులు పుష్పగుచ్ఛాన్ని అందజేసి మెమెంటో బహూకరించారు. అనతికాలంలోనే రూ.8.76 కోట్లతో గ్రామాభివృద్ధి చేపట్టిన సర్పంచ్ రాంబాబు కృషిని గ్రామ పెద్దలు కొనియాడారు. అనంతరం పశువుల అందాల పోటీలు, ఎడ్ల పరుగు పందెంలో అవార్డులు సాధించిన కోరా వీరభద్రరావు, రెడ్డి సత్తిబాబును సర్పంచ్ రాంబాబు ఘనంగా సత్కరించారు. రెడ్డి రామారావు, గుణ్ణం శ్రీనివాసు, ఎంపీటీసీ యార్లగడ్డ రమేష్, మోదుకూరు సర్పంచ్ పెంటపాటి శ్యామల తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుస్తుల పంపిణీ

అమలాపురం రూరల్: ఇమ్మిడివరప్పాడు వృద్ధాశ్రమంలో ఆదివారం గుళ్లపల్లి వెంకటరామయ్య మహాలక్ష్మి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ అధ్యక్షుడు గుళ్లపల్లి సత్యనారాయణ తన భార్య పద్మావతి కామేశ్వరి పేరు మీద వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. ఆశ్రమ నిర్వాహకులు రాపాక విక్టర్ డానియేలు, పామర్తి రాజు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలి

మామిడికుదురు: పి.గన్నవరం నియోజకవర్గంలో ప్రధానంగా ఉన్న గోదావరి నదీకోత నివారణకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు రాష్ట్ర ఇరిగేషన్ ఇంజినీర్ ఇన్ చీఫ్ ఎల్.నారాయణరెడ్డిని కోరారు. దిండి రిసార్ట్స్‌లో ఈఎన్‌సీని మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనను శాలువతో సత్కరించారు. నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలకు నిధులు మంజూరు చేయాలని కోరారు. ప్రధాన సమస్య అయిన గోదావరి నదీకోత నుంచి తీర గ్రామాలకు విముక్తి కలిగించేందుకు రివిట్‌మెంట్ల నిర్మాణంతో పాటు గ్రోయిన్లు నిర్మించాలని కోరారు. ఊడిమూడి ఉచ్చులవారిపేట వద్ద బ్రిడ్జి నిర్మాణం, ఆదుర్రు వాడబోది మీడియం డ్రైన్ ఆధునీకరణ తదితర పనులకు తక్షణం నిధులు మంజూరు చేసి ఆయా సమస్యల పరిష్కారానికి సహకరించాలని ఎమ్మెల్యే చిట్టిబాబు ఈఎన్‌సీని కోరారు.